క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 23, బెండ 21, పచ్చి మిర్చి 40, కాకర 32, బీర 23, క్యాబేజీ 15, ఫ్రెంచి బీన్స్ 50, క్యారెట్ 35, దొండ 23, చిక్కుడు 45, గోకర 23, బీట్‌రూట్ 19, క్యాప్సికం 35, ఆలు 22, దోస 25, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 28, చామగడ్డ 35. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మిల్లెట్స్ కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న మురళీధర్‌రావు తదితరులు

నాగోలు: అంతర్జాతీయ మిల్లెట్స్–2023 ప్రకటించిన సందర్భంగా ఆదివారం నాగోలు డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ రోడ్ నంబర్-5లో ఏర్పాటు చేసిన మిలెట్స్ కేంద్రాన్ని బీజేపీ మధ్యప్రదేశ్ ఇంచార్జ్ మురళీధర్ రావు, కర్ణాటక ఎమ్మెల్సీ రవికుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ–సురేంద్రనాథ్, కాలనీవాసులు కాలంశెట్టి లయ, హరిబాబు, చంద్రశేఖర్ గుప్తా, రాధిక, ప్రేమ్ బాబు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్ష చేయించుకుంటున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: డివిజన్ పరిధి పద్మావతినగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సెంటర్ ఫర్ సైట్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు విజయభాస్కర్‌రెడ్డి, పద్మారెడ్డి, భాస్కర్‌చారి, యాదగిరి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో మరిచిపోయిన ల్యాప్‌టాప్, పాస్‌పోర్టు

24 గంటల్లో బాధితుడికి అందజేత



బాధితుడికి లాప్‌టాప్, పోస్‌పోర్టు అందజేస్తున్న నాగోలు పోలీసులు

నాగోలు: ఆటోలో మరిచిపోయిన ల్యాప్‌టాప్, సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు ఆచూకీని 24 గంటల్లో కనిపెట్టి.. వాటిని బాధితుడికి తిరిగి అందజేసిన ఘటన నాగోలు ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మణుగూరుకు చెందిన పులిసాయికిరణ్ శనివారం సికింద్రాబాద్ నుంచి నాగోలుకు ఆటోలో వచ్చాడు. ఆటోలో తన బ్యాగును మరిపోయాడు. అందులో అతను అమెరికాకు పైచదువులకు వెళ్లేందుకు సిద్ధం చేసుకున్న పాస్‌పోర్టు, సర్టిఫికెట్లతో పాటు ల్యాప్‌టాప్ ఉన్నాయి. దీంతో బాధితుడు నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు 24 గంటల్లో ఆటో ఆచూకీ కనిపెట్టి సాయికిరణ్‌కు అతడి బ్యాగ్‌ను ఆదివారం నాగోలు స్టేషన్‌లో అందజేశారు. ఈ కేసును త్వరగా ఛేదించిన కానిస్టేబుల్ సాయిష్‌ను నాగోలు సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.

పేదింటి విద్యార్థినికి ఆర్థిక సాయం

మన్సూరాబాద్: రచయిత, సమాజ సేవకుడు డాక్టర్ పెండెం కృష్ణకుమార్ పేదింటి విద్యార్థిని ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందజేశారు. ఇబ్రహీంపట్నానికి చెందిన మేఘనకు ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. ఫీజుకు సరిపడా డబ్బులు లేక ఆమె ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న కృష్ణకుమార్ రూ.11 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మేఘన చదువులో రాణించి భవిష్యత్‌లో పేదలకు వైద్యం అందించాలని ఆయన ఆకాంక్షించారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



నాగోలులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చేశానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగోలు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజక పరిధిలో దాదాపు అన్ని కాలనీల రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. ఇంకా ఎక్కడైనా మిగిలిపోతే ఆ రోడ్ల పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. విద్యుత్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన చోట కొత్త కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీలో దెబ్బతిన్న బీటీ, సీసీ రోడ్ల స్థానంలో నూతన రోడ్లు నిర్మిస్తామన్నారు. సీసీ కెమెరాల కోసం తన కార్యాలయంలో వినతి పత్రాలు ఇచ్చిన అన్ని కాలనీలు, బస్తీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే పరిష్కరిస్తామన్నారు.వరద ముంపు సమస్య పరిష్కారం కోసం బాక్స్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామన్నారు. జీఓ 118 తీసుకొచ్చి నాగోల్ డివిజన్ పరిధిలో ఎల్‌బీనగర్ కూడలిని ఫ్రీ సిగ్నల్ వ్యవస్థగా చేశామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. వందల కోట్ల రూపాయల నిధులు తెచ్చి ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో నిర్మాణం కూడా చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాగోలు డివిజన్ మాజీ కార్పొరేటర్ చెర్కు సంగీత ప్రశాంత్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు ప్రమీల, సీనియర్ మహిళా నాయకురాలు రంగేశ్వరి, శిల్ప, నాయకులు గణేష్ యాదవ్ సతీష్ యాదవ్, జంగయ్య గౌడ్, గోల్కొండ మైసయ్య, రాములు గౌడ్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

లింగోజిగూడ డివిజన్‌వాసులతో...

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో ఆదివారం కర్మన్‌ఘాట్ కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు తమ కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, లింగోజిగూడ డివిజన్ ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులను, త్వరలో చేయనున్న పనులను వివరించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి, నాయకులు లక్ష్మీప్రసన్న, నర్రె శ్రీనివాస్ , శ్రీధర్‌గౌడ్, తిలక్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, మధుసాగర్, నర్సింహగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్‌లోని సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని కాలనీల సంక్షేమ సంఘ సభ్యులతో ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సంక్షేమ సంఘ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పహాడీషరీఫ్, జిల్లెలగూడ, సంతోష్‌నగర్ ప్రాంతాల నుంచి వర్షపు నీరు సరూర్‌నగర్ చెరువులోకి చేరుతుండటంతో ఇన్నాళ్లూ లోతట్టు కాలనీలు ముంపునకు గురయ్యేవన్నారు. ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేసి చెరువు ఔట్‌లెట్ నుంచి వచ్చే వర్షం నీరు నేరుగా చైతన్యపురి నాలాలో కలిసి.. అక్కడ నుంచి మూసీలోకి వెళ్లేలా చేస్తున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

అన్ని కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఏసీపీ



కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ భీంరెడ్డి తదితరులు

హస్తినాపురం: శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని, ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమని వనస్థలిపురం సబ్‌డివిజన్ ఏసీపీ ఎస్.భీంరెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ స్నేహపురి కాలనీలో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఆయన ఈ సందర్భంగా ఏసీపీ భీంరెడ్డి మాట్లాడుతూ,నేరాలు జరిగినప్పుడు విచారణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా మారుతాయని, అన్ని కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలు జరిగే ఆస్కారం ఉండదన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ డి.జలేంధర్‌రెడ్డి, ఎస్ఐ జగన్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్గం రాజేష్‌కు మదర్ థెరిస్సా విశిష్ట సేవా పురస్కారం



రాజేష్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న దైవజ్ఞ శర్మ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాలలో సమాజ సేవ చేస్తున్న పలువురిని ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా ఆర్‌కేపురం డివిజన్‌లోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు మదర్ థెరిస్సా విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించారు. సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సరోజమ్మ, ప్రముఖ హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ , నటుడు రాంకీ, జబర్దస్త్ నటుడు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



అస్సాం ఎమ్మెల్యే గొవల్లాను సత్కరించిన సురేందర్‌రెడ్డి

సైదాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న పలు పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి సూచించారు. ఆరు రోజులుగా మలక్‌పేట నియోజకవర్గం పరిధిలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రవాస్ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన అస్సాం ఎమ్మెల్యే తేరాష్ గొవల్లాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు మలక్‌పేట నుంచి సైదాబాద్‌లోని సురేందర్‌రెడ్డి నివాసం వరకు భారీగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ సురేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, సుపరిపాలన అందిస్తున్న మోదీని ఆదరించి ప్రజలు మరోమారు కేంద్రంలోనూ, తెలంగాణలోనూ బీజేపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, ఎంఐఎంల కుమ్మక్కు రాజకీయాలను పాతబస్తీలోనూ ప్రజలు తిప్పికొడతారన్నారు. అనంతరం అస్సాం ఎమ్మెల్యే తేరాష్ గొవల్లాను సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఆరు డివిజన్‌ల పార్టీ నాయకులు, యువమోర్చా, మహిళామోర్చా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మోర్చాల పదాధిపతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



హస్తినాపురంలో మొక్కలు నాటి నీరుపోస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: రోజు రోజుకూ పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యానవనం అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించి మొక్కను నాటారు. కార్యక్రమంలో అర్బన్ బయోడైవర్సిటీ ఎల్‌బీనగర్ జోన్ డైరెక్టర్‌తో పాటు మేనేజర్ సత్యనారాయణ, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్ర నాయక్, కాలనీ అధ్యక్షుడు యాదగిరి, జగన్‌రెడ్డి, సుదీర్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, జంగారెడ్డి, అశోక్‌కుమార్, రమాదేవి, వీణ, విజయ, రమ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సీ రవికుమార్

హస్తినాపురం: భారతీయ జనతాపార్టీ ప్రతి కార్యకర్త సైనికులవలే పని చేసి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో రానున్న శాసనసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం ఉందని కర్ణాటక రాష్ట్రప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ రవికుమార్, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ ప్రవాస్ ఎమ్మెల్యే వర్క్‌షాప్ కార్యక్రమాన్ని హస్తినాపురం డివిజన్‌లో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 70 ఏళ్ల కాంగ్రెస్ పాలన మాదిరిగా తెలంగాణలో కేసీఆర్ కుటుంబం పాలన చేస్తోందన్నారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభివృద్ధికి మొండి చేయి చూపి కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కొత్త రవీందర్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, రాజుగౌడ్, జీవన్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

ముగ్గురి జీవితాల్లో వెలుగు నింపిన రైతు



చిన్న సత్తయ్య (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ముగ్గురి జీవితాల్లో వెలుగు నింపాడో రైతు. కామినేని ఆసుపత్రి ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం ... నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం కొప్పోలు చామలపల్లికి చెందిన వరికుప్పల చిన్న సత్తయ్య(58) రైతు. పని నిమిత్తం ఈనెల 21న మహారాష్ట్రలోని పద్రకోట్‌కు వెళ్లాడు. అక్కడే అతని ద్విచక్రవాహనం ప్రమాదానికి గురైంది. వెంటనే సత్తయ్యను ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అదే రోజు రాత్రి మెరుగైన చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న సత్తయ్యకు ఈనెల 26న బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందని కామినేని వైద్యులు ప్రకటించారు. అవయవదానంపై కామినేని ఆసుపత్రి సిబ్బంది, జీవన్‌దాన్ ప్రతినిధులు సత్తయ్య భార్య ఈదమ్మ, తండ్రి ఈదయ్యలకు అవగాహన కల్పించారు. లివర్‌ను కామినేనిఆసుపత్రికి, రెండు కిడ్నీలను టీఎక్స్ హాస్పిటల్‌కు దానం చేశారు.

వరదనీటి కాలువలతో ముంపు సమస్య పరిష్కారం



కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడలో ప్రారంభించిన వరదనీటి కాలువతో లోతట్టు కాలనీల్లో వరదనీటి ముంపు సమస్య ఇట్టే పరిష్కారమవుతుందని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వరదనీటి కాలువ పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు దశరథగౌడ్, కల్యాణ్, సుంకరి రమేష్‌గౌడ్, శ్రీధర్, అంజి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

మరింత ప్రగతి సాధనకు బీఆర్ఎస్‌ను గెలిపించాలి



అజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న న్యూఈస్ట్ ప్రశాంత్‌నగర్ నాయకులు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ న్యూఈస్ట్ ప్రశాంత్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆదివారం మలక్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సత్తారపు గోపాల్, ప్రధాన కార్యదర్శి బట్టు దాసురావు ఆయన్ను సన్మానించి అభినందలు తెలిపారు. అజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం మరింత ప్రగతి సాధించడానికి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, కాలనీవాసులు బీడీ రావు, గోపాల్, బి.లక్ష్మి, సక్కుబాయి, సుదర్శన్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ రవికుమార్

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీజేపీ కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ రవికుమార్ పిలుపునిచ్చారు. కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్ కాలనీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించిన ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రవాస్ వర్క్‌షాప్ శక్తి కేంద్ర ఇన్‌ఛార్జీలు, బూత్ కమిటీ అధ్యక్షులు, నాయకుల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జీల పాత్ర కీలకమని తెలిపారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలను బీజేపీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ మాట్లాడుతూ, ఇప్పటి నుంచే పార్టీని మరింత పటిష్టం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మల్లికార్జున ఖర్గేకు దళిత నేతల ధన్యవాదాలు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పూలబొకే ఇచ్చి ధన్యవాదాలు తెలుపుతున్న మదన్‌బాబు

సైదాబాద్: చేవెళ్ల ప్రజాగర్జన బహిరంగ సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు దళితులందరి తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నానని మలక్‌పేట నియోజకవర్గ బీ–బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మదన్‌బాబు తెలిపారు. ఆదివారం నగరం నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమైన మల్లికార్జున ఖర్గేను ఎయిర్‌పోర్టులో మదన్‌బాబు కలుసుకున్నారు. ఆయనకు పూలబొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ, దళితులకు మూడెకరాలు ఇస్తానని మాట ఇచ్చి ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పారని, కానీ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పట్ల దళిత, గిరిజనులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

ప్రత్యంగిరా దేవికి లక్ష గాజుల పూజ



లక్ష గాజుల అలంకరణలో అమ్మవారు



రాధాకృష్ణులను గాజులతో అలంకరణ చేసిన దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం వారాహి సమేత శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో శ్రావణ మాసం నేపథ్యంలో ఆదివారం అమ్మవారికి లక్ష గాజుల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను, ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల గాజులతో అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో మహిళలచే లలిత, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు నాగేష్, రాష్ట్ర యుజవన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు వారికి అమ్మవారి ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయంలో అన్నదనం చేశారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణాకి రూ.51 వేల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గ రామకృష్ణాపురం డివిజన్ వాసవి కాలనీ చెందిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి మన్నెగూడ గ్రామం, పోల్కంపల్లి పరిధిలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ. 51 వేల విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పోలా రాజశేఖర్ రెడ్డి, నందికొండ యాదగిరి రెడ్డి, వంగాల శ్రీకాంత్ రెడ్డి, యాదగిరి రెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.

కేన్సర్ పేషెంట్ చికిత్సకు రూ.50 వేల సాయం

నాగోలు: పేదలకు చేయూత అందించడంలో ఉప్పల ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సికింద్రాబాద్ తిరుమలగిరికి చెందిన దూదిపల్లి సుబ్బారావు సతీమణి బొల్లేని శారద రెండున్నరేళ్లుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతోంది. వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న శ్రీనివాస్‌గుప్తా బాధితురాలి చికిత్స కోసం ఉప్పల ఫౌండేషన్ నుంచి ఆదివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

సొంత నిధులతో కమ్యూనిటీహాల్ నిర్మాణం అభినందనీయం



శివంహిల్స్‌కాలనీలో కమ్యూనిటీహాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీవాసులంతా కలిసి నిధులు పోగుచేసుకుని కమ్యూనిటీహాల్ నిర్మించుకోవటం అభినందనీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి శివంహిల్స్ కాలనీలో కాలనీవాసులు నిర్మించుకున్న కమ్యూనిటీహాల్ భవనాన్ని కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గడిచిన రెండున్నరేళ్ల కాలంలో కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ పలు పనులు పూర్తి చేశామన్నారు. కాలనీలో ఓపెన్ జిమ్, నూతన వాటర్‌బోర్, హైమాస్ట్ లైట్లు త్వరలోనే ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, నాగభూషణం, శ్యాంసుందర్‌రెడ్డి, సత్యం రాధకృష్ణారెడ్డి, ముకుందరెడ్డి, యాదగిర, సుధాకర్‌నేత, శ్రీసివాస్, శ్రీధర్‌రెడ్డి నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, యాదగిరి యాదవ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో నూతన ఓటరు నమోదు, మార్పులు–చేర్పులు చేసుకునేందుకు ఇది మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలనిడివిజన్ ప్రజలకు సూచించారు.

గర్భిణులకు ఉచిత మిల్లెట్స్ అల్పాహారం

29న వనస్థలిపురంలో ప్రారంభించనున్న గవర్నర్ తమిళిసై



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నయా మిల్లెట్స్ నిర్వాహకులు

వనస్థలిపురం: అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరం (2023) సందర్భంగా 365 రోజులపాటు 365 ప్రదేశాలలో రోజుకు 365 మంది గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ఉచిత మిల్లెట్స్ అల్పాహారాన్ని అందిస్తామని వనస్థలిపురానికి చెందిన నయా మిల్లెట్స్ వ్యవస్థాపకుడు కె.అమర్‌నాథ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 29న వనస్థలిపురంలోని నయా మిల్లెట్స్‌లో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరై రోజువారీ ఉచిత మిల్లెట్ అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.